క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



మిడ్జిల్: మండలంలోని వస్పులలో కాంగ్రెస్ కార్యకర్త చాకలి నాగయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ సోమవారం గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు సాయిలు, విజయ్, ప్రవీణ్, శ్రీను తదితరులు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా మహ్మద్ సల్మాన్



స్టేషన్ మహబూబ్‌నగర్: యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా జిల్లాకేంద్రంలోని హనుమాన్‌పురకు చెందిన మహ్మద్ సల్మాన్‌ను నియమిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సల్మాన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవిని అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని వివరించారు.

ఉపాధ్యాయుడి ఆకస్మిక మృతి



మధుసూధన్‌రెడ్డి (ఫైల్)

మిడ్జిల్: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు గంగాపురం మధుసూధన్ రెడ్డి (37) సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గుండెపోటు రావడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు వివరించారు. అడ్డాకుల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. మధుసూధన్‌రెడ్డికి భార్య అఖిల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై నిలబడిన ఓ వ్యక్తిని కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడినట్లు టూటౌన్ ఎస్‌ఐ రవిప్రకాష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌లోని మోతీనగర్‌కు చెందిన బూరెడ్డి కొండన్న సోమవారం తెల్లవారుజామున 2.30 ప్రాంతంలో పట్టణంలోని అబ్దుల్ ఖాదర్ దర్గా సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న వంతెన దగ్గర రోడ్డుపై నిలబడ్డాడు. అదే సమయంలో అటుగా వచ్చిన కారు వేగంగా ఢీకొట్టడంతో కాళ్లు విరగడంతో పాటు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించి కుమారుడు బూరెడ్డి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

తాగునీరు కలుషితం

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో మిషన్ భగీరథ తాగునీరు కలుషితమై చాలామందికి శరీరంపై దద్దుర్లు వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండురోజుల నుంచి ఈ పరిస్థితి నెలకొందని అధికారులు వెంటనే స్పందించి నీటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి'

నారాయణపేట టౌన్: ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం దళిత ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మరికల్‌లో ఈనెల 20వ తేదీన జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ ఆ కంపెనీ వల్ల రైతులు, ప్రజలకు నష్టం కలుగుతోందని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమిలో గ్రామాలకు దగ్గరలో ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేయడం ఎంత మాత్రం సరికాదన్నారు. ఈనెల 20న మరికల్‌లో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని రైతులు, రైతు కూలీలు, ప్రజలు ప్రజాస్వామ్యవాదులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి హన్మంతు, ప్రజాకళామండలి నాయకులు రమేష్, రైతు సంఘం జిల్లా నాయకులు నర్సింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, చిత్తనూర్ నరేందర్‌గౌడ్, చిత్తనూర్ రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా కరపత్రాల విడుదల

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దును కోరుతూ మరికల్ బస్టాండ్ ఎదుట ఈ నెల 20న చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సోమవారం కంపెనీ వ్యతిరేక కమిటీ సభ్యులు కరపత్రాలను విడుదల చేశారు. అధిక సంఖ్యలో మరికల్ గ్రామస్తులు తరలివచ్చి తమకు మద్దతు పలకాలని కోరారు. కమిటీ సభ్యులు లక్ష్మయ్య యువక మండలి అధ్యక్షులు రవికిరణ్, అంజనేయులు, రవి, రాజు, మల్లయ్యలు పాల్గొన్నారు.



మర్రిచెట్టుతండాలో బోనాలతో గిరిజన మహిళలు



భూత్పూర్ మండలం మిర్యాతండాలో శకటోత్సవాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



పాలమూరులో గాలిపటాలు ఎగుర వేస్తున్న రాజస్థాన్ సమాజ్ మహిళలు

సంబరాల సంక్రాంతి

జిల్లా ప్రజలు ఆదివారం సంక్రాంతిని, సోమవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు ఉంచి రేగిపళ్లు, పూలతో అలంకరించారు. చిన్నారులు, యువకులు గాలిపటాలు ఎగరవేస్తూ సందడి చేశారు. పండుగరోజు తీపి వంటకాలు, కనుమ రోజు విందులు, వినోదాల్లో మునిగి తేలారు. పండుగ రోజున భూత్పూర్ పురపాలికలోని మిత్యాతండాలో జరిగిన శకటోత్సవంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న చెన్నకేశవస్వామికి యాదవ సంఘం సభ్యులు పూజలు చేసి ఉద్దాలు సమర్పించారు. పక్కనే ఉన్న చౌడమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మర్రిచెట్టుతండా ఆంజనేయస్వామి ఆలయం వద్ద గిరిజన మహిళలు బోనాల ఉత్సవం నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



నవాబుపేట రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు



రాజాపూర్ మండలం రాయపల్లిలో..



మహమ్మదాబాద్‌లో..



రాజాపూర్ మండలం దొండ్లపల్లిలో ట్రాక్టర్ల ఊరేగింపులో అభిమన్యురెడ్డి తదితరులు



మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో ముగ్గుల పోటీలు



మహబూబ్‌నగర్ కళాశాల మైదానంలో గాలిపటాల పండుగలో వాసవీ, వనితాక్లబ్ సభ్యులు



జిల్లాకేంద్రంలో ఓ ఇంటి ముంగిట పాలు పొంగిస్తున్న మహిళలు



మహబూబ్‌నగర్‌లోని గోల్డెన్‌హిల్స్‌కాలనీలో ఓ ఇంటి ఎదుట ముగ్గులు వేస్తున్న మహిళలు



పాలమూరు పాన్ చౌరస్తాలో మేడపై గాలిపటాలు ఎగురవేస్తూ..

ఘనంగా నిజాం సంస్మరణ సభ



సంస్మరణ సభలో పాల్గొన్న పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మీర్ మహబూబ్‌అలీ ఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 8వ నిజాం ప్రిన్స్ ముకర్రంజా బహదూర్ మీర్ బర్కత్‌అలీఖాన్ సంస్మరణ సభ జిల్లాకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మీర్ మహబూబ్‌అలీఖాన్ మనువడు బర్కత్‌అలీ ఖాన్ అన్నారు. నిజాం వంశంలో అనేకమంది లౌకికవాద పరిపాలకులు ఉన్నారని, ప్రజారంజకంగా పాలించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అబ్దుల్ రహీం, వివిధ సంఘాల ప్రతినిధులు ఎస్‌ఎం ఖలీల్, ఒబేదుల్లా కొత్వాల్, హనీఫ్ అహ్మద్, సంజీవ్ ముదిరాజ్, లక్ష్మణ్‌గౌడ్, కురుమూర్తి, జలాలుద్దీన్, అహ్మద్, లక్ష్మయ్య, షేక్ అబ్దుల్లా, రహమాన్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

మహబూబ్‌నగర్ రూరల్: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటకదిరలో 14 రోజులుగా కొనసాగుతున్న దివంగత మన్యంగౌడ్ స్మారక క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. చివరి పోరు దేవరకద్ర, మద్దిగట్ల జట్ల మధ్య జరగగా మద్దిగట్ల జట్టు విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి రూ.25 వేల నగదును సర్పంచ్ మల్లు రమ్య దేవేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ మస్తాన్, ఉప సర్పంచ్ మునీర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహులు, ఇమ్రాన్, రాములు, మల్లు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్, ఆర్గనైజర్లు నాని, శ్రీకాంత్, యాదయ్య, చిన్న తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మల్లు దేవేందర్‌రెడ్డి

మధుకాగులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాలమూరు ప్రజలు గొప్ప ప్రజా ఉద్యమకారుడిని కోల్పోయిందని పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో పాలమూర్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా ఉద్యమకారుడు మధుకాగుల చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడని, ప్రభుత్వాలు చేసే తప్పులను ప్రశ్నించే గొంతుక మధు అని కొనియాడారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి, పాలమూరు కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గడ్డమీది గోపాల్, జక్క గోపాల్, గద్వాల రామలింగం, దినేష్, భూపతి, పాండే వెంకటేష్, మహేశ్వర్‌రెడ్డి, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

అడ్డాకుల: మూసాపేట శివారు రామస్వామి గుట్టపై ఉన్న పురాతన శివాలయాన్ని ఆదివారం టీపీసీసీ కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాన్ని పరిశీలించి మాట్లాడారు. కాకతీయుల కాలంలో రాణిరుద్రమ ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోందని.. దానిని పరిరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి రాకపోకలకు అనువుగా లేనందున దానిని బాగు చేయించేందుకు తనవంతు సాయం అందిస్తానని ప్రకటించారు. గుప్తనిధుల వేటలో పూర్తిగా ధ్వంసమైన ఆలయాన్ని పునర్నిర్మిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఆయనవెంట పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి శేఖర్, ఇస్తంపల్లి మాజీ సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎన్‌టీగౌడ్, నాయకులు టీసీ శ్రీను, కండక్టర్ నారాయణ, జలగరి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



ఆలయాన్ని పరిశీలిస్తున్న టీపీసీసీ నేత కాటం ప్రదీప్‌గౌడ్

వాలీబాల్ టోర్నీ



విజేత, రన్నరప్ జట్లతో నిర్వాహకులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపూర్‌లో గ్రామానికి చెందిన పోలీసులు శనివారం, ఆదివారం వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. కొండాపూర్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో గ్రామానికి చెందిన 8 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో బురాన్ టీం విజేతగా, అమృత్ టీం రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు రాజు, ఉపేందర్, పర్వతాలు, నరేశ్, కృష్ణ పాల్గొన్నారు. క్రీడాకారులకు పోలీసులు టీషర్ట్‌లను అందజేశారు.

ఐదుగురు బాలకార్మికులకు విముక్తి

బాలానగర్: మండలంలోని నందారంలో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఐదుగురు బాలకార్మికులకు ఆపరేషన్ స్మైల్ బృందం సోమవారం విముక్తి కల్పించింది. యజమానులకు జరిమానాలు విధించి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి చిన్నారులను పాఠశాలలు, హాస్టల్‌లో చేర్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారుల బృందం తెలిపింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన కృష్ణవర్ధన్‌రెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కృష్ణవర్ధన్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సోమవారం తహసీల్దార్ కిషన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

'బీజేపీ సర్కారుతోనే అభివృద్ధి'

నారాయణపేట రూరల్ : కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే త్వరితగతిన అభివృద్ధి జరుగుతుందని, రాబోవు ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగురావు నామాజీ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం కోయిలకొండ మండలానికి చెందిన పలువురు యువకులు, ఇతర పార్టీల నాయకులను కాషాయ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్‌ను ఇంటికి పంపాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రతంగపాండురెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రభాకరవర్ధన్, కేశవ్, మహబూబ్‌అలీ, కరుణాకర్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, విష్ణు, చెన్నయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో కొనసాగుతున్న రహదారులు, కూడళ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కూడలి, అప్పన్నపల్లి రెండో ఆర్‌ఓబీ పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లు విస్తారంగా, ప్రతి కూడలి అద్భుతంగా ఉండాలన్నారు. ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని, కల్వర్టులు, నాలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు. మినీ శిల్పారామంలో బోటింగ్, అడ్వెంచర్ పార్క్ అభివృద్ధి చేయాలన్నారు. సమీక్షలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, అదనపు కలెక్టర్ తేజాస్ నందూలాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ ప్రదీప్‌కుమార్, పీఆర్ ఈఈ నరేందర్, డీఈ విష్ణు తపాల్గొన్నారు.

● పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం కురిహినిశెట్టి కాలనీలోని జాంగ్ర కమ్యూనిటీ హాల్‌లో ఉమ్మడి జిల్లా జాంగ్ర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాంగ్ర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు చేపట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో జిల్లాను నంబర్ వన్‌గా తీర్చిదద్దుతామని తెలిపారు. ముడా చైర్మన్ గంజి వెంకన్న, జాంగ్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజి శివశంకర్, ప్రధాన కార్యదర్శి బందిగే రాంచందర్, కోశాధికారి ఎస్.వెంకటేష్, ఉపాధ్యక్షురాలు అచ్చుగట్ల భ్రమరాంబ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రామలింగం, జాంగ్ర ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి బందిగె గోపి, యువజన విభాగం పట్టణ ప్రధాన కార్యదర్శి టంకశాల మల్లేష్ పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేద్దాం'



మాట్లాడుతున్న ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌ఓ) రాష్ట్ర మహాసభలు వచ్చేనెల 11న హైదరాబాద్‌లో జరుగుతాయని, పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేద్దామని సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలో జరిగిన సంఘం జిల్లాస్థాయి సమావేశంలో పలువురు ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. భావ ప్రకటన స్వేచ్ఛపై ఫాసిస్టుల దాడి తీవ్రతరమైందని.. ఇలాంటి పరిస్థితుల్లో శాంతి సంఘీభావ సంఘంలో విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కళాకారులు, కవులను సభ్యులుగా చేర్చి శాంతి ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ నెల 22న ప్రపంచ విప్లవకారుడు చెగువేరా కూతురు, మనుమరాలు హైదరాబాద్‌కు వస్తున్నారని.. రవీంద్రభారతిలో సన్మానసభ ఏర్పాటు చేశామని జయప్రదం చేయాలని కోరారు. దళితులు, మైనార్టీలు, ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను ఖండించాలని, వచ్చే నెల 6న కవి సమ్మేళనం, ఉర్దూ ముషాయిరా నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు ఒబేదుల్లా కొత్వాల్, ఎస్‌ఎం ఖలీల్, సంజీవ్ ముదిరాజ్, కిల్లె గోపాల్, సమద్‌ఖాన్, విల్సన్, హనీఫ్ అహ్మద్, షేక్ అబ్దుల్లా, కురుమూర్తి, లక్ష్మణ్‌గౌడ్, జగపతిరావు, జలాలుద్దీన్, మల్లయ్య, రాజసింహుడు, ఎంఏ రహీం, లక్ష్మణ్, కిష్టయ్య, తాహెర్, భానుప్రసాద్, రామదాసు, అహ్మద్, రాజయ్య, విజయవర్ధన్, భరత్, నందు, సిఖిందర్, జహంగీర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా బడిబయటి పిల్లల సర్వే



బడిబయటి పిల్లల సర్వేను పరిశీలిస్తున్న ఏఎంఓ

జడ్చర్ల టౌన్: బడిబయటి పిల్లల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఏఎంఓ వెంకట్రాంరెడ్డి సూచించారు. సోమవారం పుర పరిధిలోని రాజీవ్‌నగర్‌కాలనీలో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. బడిమానేసిన పిల్లల వివరాలు తెలుసుకోవటంతో పాటు వారు ఎందుకు మానేశారో తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని సూచించారు. ఆయన వెంట కాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, సీఆర్పీ రాములు తదితరులు ఉన్నారు.

ఘనంగా జైపాల్‌రెడ్డి జయంతి

మిడ్జిల్: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జయంతిని సోమవారం మండలంలోని వస్పులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సాయిలు, ప్రవీణ్, విజయ్‌కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న జి.శంకర్

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో సంక్రాంతి సందర్భంగా సోమవారం మాసన్న మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జి.శంకర్, కమలాకర్, మాసమ్మ వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పండుగలను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో దుస్తులు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సుదర్శన్, భగవాన్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, గ్రామస్తులు రాఘవరెడ్డి, నాగిరెడ్డి, నెల్లి ప్రభాకర్‌రెడ్డి, తిర్మలాపురం రాయులు, నాగన్న, సంజన్న, మోహన్‌కుమార్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికిస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

అడ్డాకుల: వాహనదారులు విధిగా రహదారి నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ విజయకుమార్ అన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రేడియం స్టిక్కర్లు లేకుండా తిరుగుతున్న వాహనాలకు టోల్‌ప్లాజా సిబ్బంది కొత్తవి అతికించి రహదారి నిబంధనలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ సంతోష్, రూట్ ఆఫీసర్ రాకేష్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.